www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 30 అక్టోబర్ 2025 5
ఏలూరు



నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం

ప్రమాదకర పరిస్థితులుంటే తాత్కాలికంగా మూసివేయాలి

డిఇఒ ఎం. వెంకట లక్ష్మమ్మ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో తుపాన్ ప్రభావం తగ్గడం వల్ల అన్ని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాల్లోని పాఠశాలలు ఈ నెల 30వ తేదీ గురువారం నుండి యధావిధిగా నిర్వహించొచ్చని డిఇఒ ఎం. వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం ఉదయం పాఠశాల భవనం, ప్రాంగణం మొత్తం పరిశీలించుకోవాలని సూచించారు. ఎక్కడైనా నీరు నిలిచిపోవడం, విద్యుత్ ప్రమాదం, గోడ కూలే పరిస్థితి, లేదా విద్యార్థులకు ప్రమాదకర వాతావరణం ఉంటే పాఠశాలను తాత్కాలికంగా మూసివేసి వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు.

అన్నదాత ఆక్రందన..!

మొంథా తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలు

వరిరైతుకు కోలుకోలేని దెబ్బ

పశ్చిమలో 26 వేల ఎకరాల్లో వరి పంటకు ముప్పు

ఏలూరు జిల్లాలో 7,920 ఎకరాల్లో వరి, ఇతర పంటలకు దెబ్బ

గింజ గట్టిపడే, ఈనిక దశలో నేలకొరగడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం

82 ఎకరాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు

తీరప్రాంతంలో 1200 ఎకరాల్లో ఆక్వా చెరువులకు గండి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మొంథా తుపాను అన్నదాతను నిలువునా ముంచేసింది. తుపాన్ తీరం దాటేముందు వీచిన ఈదురుగాలులు, వర్షాలు పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. చివరిదశకు చేరిన పంట తీవ్రంగా దెబ్బతింది. దీంతో ముఖ్యంగా వరిరైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పంట నష్టానికి సంబంధించి అధికారులు ప్రాథమిక అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. మరో రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వనున్నారు. తుపాను ప్రభావంతో ఈదురుగాలులు, వర్షాలకు రెండు జిల్లాల్లో పక్వానికి వచ్చిన పంటంతా నేలనంటి నీటిలో నానుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. తుపాన్ దెబ్బకు పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 27,500 ఎకరాల్లో వరిపంటకు ముప్పు వాటిల్లింది. దీనిలో 10,521 ఎకరాల్లో పంట ముంపునకు గురవ్వగా, 17,040 ఎకరాల్లో పంట నేలనంటింది. ఏలూరు జిల్లాలో వరి 6,075 ఎకరాల్లో ముంపునకు గురవ్వగా, మినుము 881 ఎకరాలు, వేరుశెనగ 67 ఎకరాలు, పత్తి పంట 897 ఎకరాల్లో దెబ్బతింది. ఉద్యాన పంటలు అరటి, కూరగాయలు, కొబ్బరికి సంబంధించి 82 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. వరిసాగులో పంటనష్టం తీవ్రంగా ఉందని రైతులు చెబుతున్నారు. ఈనిక, గింజ గట్టిపడే దశలో పొలాలు నేలనంటి నీటిలో నానుతున్న పరిస్థితి ఉంది. ఎకరాకు పది నుంచి ఎనిమిది బస్తాలు దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. నీరు తగ్గకపోతే పంట కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు తక్కువగా లెక్కించినా రూ.20 వేలకుపైగా నష్టం ఉంటుందని రైతులు చెబుతున్నారు. అత్యధికంగా ఉంగుటూరు మండలంలో 2,500 ఎకరాల్లో పంట నేలనంటడం, ముంపుబారిన పడిన పరిస్థితి ఉంది. డెల్టాలోనూ అనేక మండలాల్లో పెద్దఎత్తున పంట ముంపు బారిన పడింది. వరి రైతులు ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. పంటంతా చివరిదశకు చేరింది. మరో 15 రోజుల్లో పంట


చింతలపూడిలో నేలకొరిగిన వరిచేను

చేతికొచ్చే సమయంలో మొంథా తుఫాను దెబ్బకు రైతుల ఆశలన్నీ నీరుగారిపోయాయి. ముఖ్యంగా కౌలురైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. నేలనంటిన వరిచేలు మాసూలు చేయడానికి ఎకరాకు రూ.పది వేలు వరకూ ఖర్చవుతుందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. నరసాపురం తీర ప్రాంతంలో నల్లికిక్ ఉప్పొంగి గండిపడటంతో 1200 ఎకరాల ఉప్పునీటి రొయ్యల చెరువులకు తీవ్ర నష్టం వాటిల్లిన పరిస్థితి ఉంది. తుపానుకు సంబంధించి తీసుకున్న చర్యలతో రెండు జిల్లాల్లోనూ ప్రాణం నష్టం చోటు చేసుకోలేదు.

పంటనష్టం ప్రాథమిక వివరాలు ఏలూరు జిల్లాలో

పంట	ఎకరాలు
వరి	6,075
మినుము	881.2
వేరుశెనగ	67
పత్తి	897.2

నష్టపోయిన రైతులు: 9,567 మంది
తుపాన్ ప్రభావం పడిన గ్రామాలు: 281

పశ్చిమలో దెబ్బతిన్న పంట ప్రాథమిక వివరాలు (ఎకరాల్లో)

ముంపునకు గురైన వరి పంట :	10,521
నేలనంటిన పంట:	17,040
ఆక్వా చెరువులు:	1200

కూలిన చెట్లు..

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు..

తుపాన్ ప్రభావంతో వీచిన గాలులకు రెండు జిల్లాల్లోనూ పెద్దఎత్తున విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 174 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. విద్యుత్ శాఖాధికారులు వెంటనే చర్యలు ప్రారంభించి పునరుద్ధరించే పని చేపట్టారు. 93 ఇళ్లు దెబ్బతిన్నట్లు అధికారులు తేల్చారు. 662 చెట్లు కూలడంతో అధికారులు తొలగించారు. ఏలూరు జిల్లాలో విద్యుత్ స్తంభాలు 183, ట్రాన్స్‌ఫార్మర్లు 22 వరకూ దెబ్బతిన్నాయి. కలిదిండి వంటి ప్రాంతాల్లో ఆర్అండ్‌బి రోడ్లు దెబ్బతినడంతో రూ.25 లక్షలు నష్టం వాటిల్లింది. తుపాన్ ప్రభావం జిల్లాపై తక్కువగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సహాయక చర్యలు ముమ్మరం చేయాలి

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో తుపాన్ సహాయక కార్యక్రమాలను ముమ్మరం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం తుపాన్ సహాయక కార్యక్రమాలపై జిల్లా ప్రత్యేక అధికారి కాంతిలాల్ దండే, కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్త చర్యలతో మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నామన్నారు. అదే స్ఫూర్తితో తుబీవన్ అనంతరం సహాయక కార్యక్రమాలను ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగని రీతిలో చేపట్టాలన్నారు. ఆస్తి, పంట, పశునష్టం అంచనాలను ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 90 తుపాన్ సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి, 3422 కుటుంబాలకు చెందిన ఏడు వేల మందికి భోజన, వసతి సదుపాయాలు కల్పించామన్నారు. తుపాన్ కారణంగా దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ స్తంభాలను వెంటనే పునర్నిర్మించాలన్నారు. జిల్లా ప్రత్యేక అధికారి కాంతిలాల్ దండే, కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సిబ్బంది కృషిని అభినందించారు.

పెదపాడు: వట్లూరు గ్రామంలో నేలనంటిన వరిచేలను మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, దెందులూరు, ఉంగుటూరు ఎంఎల్‌ఎలు చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, వడ్డీల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి, ఆర్‌టిసి విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు వరిదుబ్బులను చూపి, తమ బాధను వ్యక్తం చేశారు. మంత్రి స్పందిస్తూ నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామన్నారు. దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ 1318 వరి రకం ఎటువంటి విపత్తులనైనా తట్టుకునే శక్తి ఉందన్నారు. కానీ ఈదురుగాలులకు నేలనంటిందన్నారు. ఈ ప్రాంత రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం ఏపూరులోని ఎంపిపి ప్రాథమిక పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని సందర్శించి, బాధిత కుటుంబాలను కలిసి, అందుతున్న సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. బియ్యం, నిత్యావసర సరుకులు, నగదు పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, డిఎస్‌ఒ ఐబి.విలియమ్స్, జిల్లా వ్యవసాయ శాఖ జెడి షేక్ హబీబ్‌భాషా, తహశీల్దార్ ఎ.కృష్ణజ్యోతి పాల్గొన్నారు.


ఏపూరులో బాధితులకు సాయం అందిస్తున్న మంత్రి

సమస్యలపై గళం ఎత్తితే కేసులా


వంగాయగూడెం కేన్సర్ ఆసుపత్రి రోడ్డు అధ్వానంగాపై స్థానికుల ధర్నా

నాయకత్వం వహించిన వ్యక్తిని స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు

సిపిఎం చొరవతో విడిచిపెట్టిన వైనం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమస్యలపై గళం ఎత్తితే సమస్యలు పరిష్కారం కాకపోగా పోలీస్ కేసులు పెడతామనే బెదిరింపులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏలూరు నగరంలో చోటు చేసుకుంది. ఏళ్ల తరబడి పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి గురై భయంకరమైన గోతులతో అధ్వానంగా ఉన్న నిత్యం ప్రమాణాలు నిలయంగా మారిన వంగాయగూడెం కేన్సర్ ఆసుపత్రి రోడ్డును బాగు చేయాలని కోరుతూ మంగళవారం స్థానికులు ధర్నా చేశారు. ఇందుకుఏలూరు రూరల్ పోలీసులు ఆ ధర్నాకు నాయకత్వం వహించిన రామ్‌కుమార్ అనే వ్యక్తిని బుధవారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎన్నో ఏళ్లుగా వంగాయగూడెంలోని కేన్సర్ ఆసుపత్రి రోడ్డు వేయకపోవడంతో వర్షాలకు గోతులు పడి నిత్యం ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో స్థానికులు ఎన్నోసార్లు అధికారులకు, పాలకులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా తయారై అడుగు బయట పెట్టలేని పరిస్థితిలో రోడ్డు ఉండటంతో మంగళవారం స్థానికులు రోడ్డు నిర్మాణం కోసం ధర్నా నిర్వహించారు. అయితే రూరల్ పోలీసులు రంగ ప్రవేశం చేసి ధర్నాను విరమింపజేసేలా చేయడమే కాకుండా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగజేస్తున్నారంటూ కేసులు పెడతామని బెదిరించారు. అన్నట్లుగానే బుధవారం ఆ ధర్నాకు నాయకత్వం వహించిన రామ్‌కుమార్ అనే వ్యక్తి జూట్ మిల్ వంతెన వద్ద ఉన్న సాయిబాబా ఆలయం వద్ద ఉండగా రూరల్ పోలీసులు వచ్చి స్టేషన్‌కు రావాలని చెప్పి తీసుకెళ్లారు. తనను ఎందుకు తీసుకొచ్చారని అడగగా ఎస్ఐ లేరని, వచ్చాక మాట్లాడతారని, ధర్నా పేరుతో ప్రజలకు ఆటంకం కలిగించినందుకు తీసుకొవచ్చామని పోలీసులు చెప్పారు. దీంతో రాంకుమార్ తన స్నేహితులకు ఫోన్ చేయగా వారంతా స్టేషన్‌కు చేరుకుని తమ స్నేహితుడిని ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించగా పోలీసులు ఎస్ఐ వచ్చాక చెబుతారంటూ సమాధానం చెప్పారు. అంతేకాక వచ్చిన వారందరినీ వీడియో సైతం తీశారు. ఇదిలా ఉండగా విషయం తెలుసుకున్న సిపిఎం నగర కార్యదర్శి రవికుమార్, నాయకులు గోపీ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేస్తే కేసులు పెడతారా అంటూ పోలీసులను ప్రశ్నించారు. దీంతో పోలీసులు రామ్‌కుమార్‌ను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం పోరాడితే కేసులు పెడతామని బెదిరించడం దారుణన్నారు. వంగాయగూడెం కేన్సర్ ఆసుపత్రి రోడ్డు సమస్యపై త్వరలోనే సిపిఎంగా ఆందోళన చేస్తామని తెలిపారు.


పోలీస్‌స్టేషన్ వద్ద రామ్‌కుమార్, సిపిఎం నేతలు

తుపాన్ బాధితులను ఆర్థికంగానూ ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

పునరావాస కేంద్రాలను సందర్శించిన నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తుపాన్ పునరావాస కేంద్రాల్లోని ప్రజలు ఉపాధి కోల్పోయినందువల్ల ప్రభుత్వం ఆర్థిక సహకారం కూడా రోజువారి కూలి లెక్కించి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. సిపిఎం బృందం బుధవారం స్థానిక కస్తూరిబా హైస్కూల్, తంగెళ్లమూడి మసీదులో ఉన్న పునరావాస కేంద్రాలను సందర్శించి బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తంగెళ్లమూడి మసీదు పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులంతా టిడ్కో ఇళ్ల కోసం డబ్బు చెల్లించిన వారేనని, రూ.50 వేలు అప్పు చేసి ప్రభుత్వానికి చెల్లించినా లబ్ధిదారులకు ఇల్లు అందజేయలేదన్నారు. సరైన ఇంటి సదుపాయం లేనందు వల్ల చిన్నపాటి వర్షానికి సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పునరావాస కేంద్రాల్లో ప్రభుత్వం భోజనం, టిఫిన్ ఏర్పాట్లు బాగానే చేసినప్పటికీ ఆర్థికంగా కూడా ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పేదల కోసం మసీదును పునరావాస కేంద్రానికి ఇచ్చిన నిర్వాహకులను అభినందించారు. సిపిఎం కార్యాలయాలను పునరావాస కేంద్రాలకు ఇచ్చేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటుందని, అధికారులు ఉపయోగించుకోవాలని కోరారు. కరోనాకాలంలో సిపిఎం కార్యాలయాలను ఐసోలేషన్స్ కేంద్రాలుగా మార్చామని గుర్తు చేశారు. రోడ్ల పక్కన వినాయక విగ్రహాలు తయారు చేసేందుకు వచ్చిన రాజస్థాన్ వలస కూలీలను అధికార పార్టీ కార్యకర్తలు లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు వాపోయారన్నారు. ఉపాధి కోసం వలస వచ్చిన పేదలను దోపిడీ చేయడం సరికాదని హితవు పలికారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్, నేతలు ఎం.ఇస్సాక్, జె.గోపీ, మీసాల సత్యం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఏలూరు అర్బన్: బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి, నేతలు



జీలుగుమిల్లి : పునరావాస కేంద్రంలో మాట్లాడుతున్న నేతలు

జీలుగుమిల్లి: తుపాన్ బాధితులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని సిపిఎం మండల కన్వీనర్ సిరిబత్తుల సీతారామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉన్న సంచార కుటుంబాలను సిపిఎం నేతలు పరామర్శించారు.

జంగారెడ్డిగూడెం: వేగవరంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సిపిఎం నేతలు సందర్శించి బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేత జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ ఇక్కడ ఆశ్రయం పొందుతున్న మత్స్యకార కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. కొంగవారిగూడెం ప్రాంతంలో ఉన్నవారినీ అధికారులు ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నేతలు బొడ్డు రాంబాబు, ఎ.ప్రభాకరరావు, సిహెచ్ రవి, మత్స్యకారుల సంఘం ప్రెసిడెంట్ దాసరి బాబూరావు, పంతుల శ్రీనివాసరావు, పంతుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


చింతలపూడి: ముంపు బాధితులతో మాట్లాడుతున్న నేతలు

చింతలపూడి: పట్టణంలో తుపాన్ పునరావాస కేంద్రాలను, ప్రభావిత ప్రాంతాలను సిపిఎం బృందం సందర్శించింది. బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో ఉన్న బాధితులను కలిసి అందుతున్న సాయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలసి వారికి అందుతున్నటువంటి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నాడు తీసుకొచ్చిన బాధితులకు ఉదయం అల్పాహారం ఇవ్వలేదని నేతల దృష్టికి రాగా అధికారులతో మాట్లాడారు. ముంపు ప్రాంతాలైన గణేష్ కాలనీ, బోయగూడెం చెరువు కొమ్ము నివాస ప్రాంత వాసులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. బోయగూడెం చెరువు కొమ్ము నిర్వాసితులు తమకు సరైన రోడ్డు సౌకర్యం లేదని, విద్యుత్ స్తంభాలు వేశారుగానీ వాటికి వైర్లు గాని, విద్యుత్ దీపాలుగాని వేయలేదని వాపోయారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ పాలేటి పాండురంగారావు, చింతలపూడి పట్టణ కార్యదర్శి ఎస్.సూర్యకుమార్, మండల నాయకులు దేవగురు సత్యనారాయణ, రామిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం : బాధితులతో సిపిఎం నేతలు

ఎడతెరిపి లేని వర్షం.. రోడ్లు జలమయం

గాలులకు కూలిన తాటాకిల్లు

విద్యుత్ స్తంభంపై పడిన భారీ వృక్షం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తుపాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ వర్షానికి రహదారులన్నీ జలమయం అయ్యాయి. మండలంలోని పలు చోట్ల వేసిన పొగాకు నారుమడుల్లోకి నీరు చేరింది. పలు చోట్ల కోతకొచ్చిన వరి చేలు నేలకొరిగాయి. ఈదురుగాలులకు మండలంలోని లక్ష్మీపురంలో భారీ వృక్షం విద్యుత్ స్తంభాలపై పడి ఇంటి కంచె మీద నేలకొరిగాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపేశారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి సుబ్బరాయన్, ఎస్ఐ క్రాంతి కుమార్, ఎంపిడిఒ నిఖిల్, తహశీల్దార్ ఉదయ్ భాస్కర్, పంచాయతీ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని భారీ వృక్షాన్ని తొలగించారు. అనంతరం విద్యుత్ శాఖ సిబ్బంది నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ ను పునరుద్ధరించారు. మండలంలోని పాత చీమలవారిగూడెంలో టి.దుర్గారావుకు చెందిన తాటాకిల్లు కూలింది.


రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న సిబ్బంది

తుపాకులు, పేలుడు మందు వాడొద్దు

పిట్టలను బెదిరించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలి

నక్కల కుటుంబాలతో ఎస్‌పి

ప్రజాశక్తి - మండవల్లి

తుపాకులు, పేలుడు మందు కలిగి ఉండడం చట్టరీత్యా నేరమని ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్ స్పష్టం చేశారు. మొంథా తుపాన్ ప్రభావంతో ఎటువంటి ప్రాణనష్టం సంభవించకుండా ప్రత్తిపాడు స్టేజి వద్ద డేరాలు వేసుకుని జీవిస్తున్న నక్కల కుటుంబాల వారిని కలెక్టర్ ఆదేశాల మేరకు భైరవపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ పునరావాస కేంద్రాన్ని బుధవారం ఎస్‌పి తనిఖీ చేశారు. భోజనం నాణ్యత, సరైన సమయానికి పంపిణీ చేస్తున్నారా, వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి నక్కలవారితో మాట్లాడుతూ మొంథా తుపాన్ వల్ల మీకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సురక్షిత ప్రాంతంగా ఇక్కడికి తరలించామని చెప్పారు. రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖాధికారుల సమన్వయంతో జిల్లాలో ఎక్కడ ఎటువంటి ప్రాణనష్టం కలుగకుండా కాపాడుకోగలిగామన్నారు. ఇళ్లల్లో ఇంకా తుపాకులు, పేలుడు పదార్థాలు కలిగి ఉంటున్నారా అని ప్రశ్నించారు. లైసెన్సులు లేకుండా తుపాకులు, పేలుడు పదార్థం కలిగి ఉండడం నేరమన్నారు. గత 20 ఏళ్లుగా ఈ ప్రాంతంలోనే తుపాకులతో పిట్టలను బెదిరిస్తూ జీవనం సాగిస్తున్నామని అది తప్ప మాకు వేరేది తెలియదని నక్కల వాళ్లు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమందు తుపాకి కలిగి ఉండడం వల్ల ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. నల్లమందు పేలే కదా మీలో చంటి పిల్లవాడితో సహా ఐదుగురు మృతి చెందారని గుర్తు చేశారు. గన్ పౌడర్‌తో తుపాకీ పేలిస్తేనే పిట్టల బెదురుతాయనుకోవడం సరికాదని, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పిట్టలను బెదిరించేలా చూసుకోవాలని చెప్పారు. అనంతరం పెద్ద అడ్లగాడి వంతెన వద్ద కొల్లేరు పరిస్థితిని పరిశీలించారు. ఆయనతో పాటు సిఐలు రవికుమార్, రామకృష్ణ, ఎస్ఐలు వెంకట కుమార్, శ్రీనివాస్, రామచంద్రరావు, దుర్గాప్రసాద్, సజ్జ సురేష్‌బాబు (బాబి), తదితరులు పాల్గొన్నారు.


నక్కల కుటుంబాలతో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

నక్కల కుటుంబాలతో ఎస్‌పి ఫొటో

మిమ్మల్ని ఒక్కసారి ముట్టుకోవచ్చా అయ్యగారు అంటూ ఎస్‌పిని అడిగిన నక్కల వ్యక్తిని భుజం తట్టి భుజంపై చేయి వేసి దగ్గరకు హత్తుకోవడంతో నక్కల కుటుంబాల వారు ఆనంద డోలికల్లో తేలియాడారు. మండలంలోని భైరవపట్నం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేసేందుకు ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ బుధవారం వచ్చారు. ఎస్‌పి నక్కల కుటుంబాల వారి వద్దకు వెళ్లి వారిని బాగున్నారా అంటూ పలకరిస్తూ వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. తుపాను వల్ల మీకు ఎటువంటి ప్రమాదం సంభవించకుండా ఇక్కడికి తీసుకొచ్చి సురక్షితంగా ఉంచామని చెప్పడంతో నక్కల కుటుంబాల వారు ఎంతో సంతోషించారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోతున్న ఆయనను ఆపి "అయ్యగారు మా దగ్గరికి ఎవరూ రారు మా వాసన ఎవరికి గిట్టదు మీలాంటి పెద్దలు మా దగ్గరికి వచ్చి మాతో మాట్లాడటం చాలా ఆనందంగా ఉంది అయ్యగారు మిమ్మల్ని ఒక్కసారి ముట్టుకోవచ్చా అయ్యగారు" అంటూ దీనంగా అడిగారు. దీంతో ఎస్‌పి అతని భుజం తట్టి భుజంపై చేయి వేసి దగ్గరకు లాక్కొని చిరు మందహాస్నీ ప్రకటించారు. మరొక బాలిక నాకు షేక్ హ్యాండ్ ఇవ్వండి అంటూ అడగడంతో ఆ బాలికకు షేక్ హ్యాండ్ ఇచ్చారు. మీ అందరితో నేనే ఫొటో దిగుతానంటూ వారందరితో ఎస్‌పి ఫొటో దిగడంతో నక్కల కుటుంబాల వాళ్లు ఎంతో సంతోషించారు.

వసతి గృహం.. సమస్యలు అనేకం

- బెడ్స్ లేక కటిక నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు
- వర్షం వస్తే మొత్తం నీరే
- అధ్వానంగా మరుగుదొడ్లు
- మంచినీటి ట్యాంకు శుభ్రం చేయని వైనం


శిథిలావస్థకు చేరిన భవనం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండలం యర్రగుంటపల్లి గ్రామంలోని ఎపి బాలుర బిసి వసతి గృహంలో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉంది. సరైన వసతులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క పక్క మరుగుదొడ్లు లేక, మరో పక్క నిండిపోయిన మరుగుదొడ్ల నుంచి వచ్చే దుర్వాసనతో, దోమలతో విద్యార్థులు అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఐదు మరుగుదొడ్లలో మూడు దారుణమైన పరిస్థితిలో ఉన్నాయి. ఒక్కటి పూర్తిగా నిండిపోయింది. నిండిపోయిన మరుగుదొడ్డి నుంచి దుర్వాసన వస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. బెడ్స్ లేకపోవడంతో కటిక నేల మీద పడుకుంటున్న పరిస్థితి. వసతి గృహంలో కిటికీలకు చెదలు పట్టింది. దోమల మెస్ లేకపోవడంతో రాత్రిపూట దోమలు విద్యార్థుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

వసతి గృహంలో దాదాపు 35 మంది విద్యార్థులు ఉన్నారు. వసతి గృహం పెంకుటిల్లు కావడంతో గట్టిగా వర్షం వస్తే పైనుంచి నీరు కారడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా బయట తిరగడానికి కూడా వీలు లేకుండా వర్షపు నీరు నిల్వ ఉంటుంది. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో పాఠశాల ప్రాంగణంలో నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇటీవల వర్షాలకు ప్రహరి కూలిపోవడంతో అడ్డంగా గ్రీన్ క్లాత్ కట్టారు. ప్రస్తుతం వసతి గృహానికి నెలకు రూ.24 వేలు అద్దె చెల్లిస్తున్నారు. వసతి గృహంలో ఉన్న మంచినీటి ట్యాంకు శుభ్రం చేయడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి పెట్టి బిసి వసతి గృహంలో ఉన్న విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.



యర్రగుంటలపల్లిలోని బాలుర బిసి వసతి గృహం

ప్రజాశక్తి పరిశీలన

పంట నష్టం.. రైతు కన్నీటిపర్యంతం

వరిలో ఎకరానికి సగం పంట నేలపాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆరుగాలం కష్టించి పండించిన వరి చేతికి అందే సమయంలో ప్రకృతి విలయం మొంథా తుపాన్ రూపంలో వచ్చి నోటికాడ కూడు లాక్కున్నట్లు అయిందని రైతులు కన్నీటి పర్యంతమువుతన్నారు. మండలంలో డెల్టా, మెట్ట ప్రాంతాల్లో 24,500 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. బోర్లు కింద పలు చోట్ల కోతలకు సిద్ధంగానూ, డెల్టా కింద మరో 20 నుంచి 30 రోజుల్లో కోతకు సిద్ధంగా ఉండే చేలు ఉన్నాయి. తుపాను ప్రభావంతో ఈదురు గాలులకు వరికంకులతో నిండుగా ఉన్న పనలు చాపలా నేలనంటాయి. వాటికి తోడు వర్షం కురవడంతో చేలల్లో నీరు ఉండి పనలు నీటిలో మునిగాయి. సార్వాలో ఎకరానికి గట్టు లంకలు, దమ్ములు, విత్తనాలు, నారుమడులు, ఎరువులు, పురుగుమందుల నుంచి నేటి వరకు రూ.25 వేల వరకు పెట్టుబడి ఖర్చులు అయినట్లు రైతులు వెల్లడిస్తున్నారు. పంట నష్టం పరిహారం కోసం వెంటనే పంట నష్టం అంచనా వేసి రైతులను ఆదుకోవాలని సాగు దారులు, రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వరి రైతులకు తీవ్ర నష్టం

చింతలపూడి :మండలంలో వరి పంట రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. చేతికొచ్చిన పంట నీట మునిగిపోవడడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. పాతచింతలపూడి సమ్మెటివారి గూడెంలో మొంథా తుపాన్ ప్రభావం వల్ల వరి పంట నేలకొరిగింది. ఎంతో ఖర్చు చేసి పెట్టుబడులు పెట్టామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని తమ బాధను వ్యక్తం చేశారు.

270 ఎకరాల వరి పంట నష్టం

కొయ్యలగూడెం :మండల వ్యాప్తంగా దాదాపు 270 ఎకరాల పంట పూర్తిగా నేలకొరిగిందని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎఒ పోశారావు మాట్లాడుతూ రాజవరం గ్రామంలో అత్యధికంగా నష్టం సంభవించిందని తెలిపారు.

పరింపూడిలో మేఘలాదేవి పర్యటన

మొంథా తుపాన్ ప్రభావం రాష్ట్రంపై ఉంటుందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అధికారిక యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని టిడిపి రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి తెలిపారు. పరింపూడి పంచాయతీలో లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల పైన కూలిపోయిన చెట్లను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించి, ప్రభుత్వం ఆదుకుంటుందని అధైర్య పడొద్దని చెప్పారు.

వర్షాలకు పాడైన పంటలు

నూజివీడు టౌన్ :తుపాను ప్రభావం కారణంగా మండలంలో వివిధ రకాల పంటలు ధ్వంసం అయ్యాయి. మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన రైతు అబ్బదాసరి అశోక్‌కుమార్ మినుము, పూలతోట వర్షానికి పాడైపోయాయని గగ్గోలు పెట్టాడు. తాను కౌలు రైతునని, ఎకరానికి రూ.1.20 లక్షల పెట్టుబడి పెట్టి సాగు చేసినట్లుగా తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు. దీనిపై వ్యవసాయ శాఖాధికారి చెన్నారావును వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పాడైపోయిన న మోదు చేసి ప్రభుత్వానికి ని వేదిక పం పుతున్నట్లు తెలి పారు.

వరి పొలాల పరిశీలన

ద్వారకాతిరుమల :మండలంలోని పి.కన్నాపురంలో దెబ్బతిన్న వరి పొలాలను ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులను ఆదుకుంటామని చెప్పారు.

వరి, మినుము పంటల పరిశీలన

నూజివీడు టౌన్ :మండలంలోని మీర్జాపురం, మర్రిబంధం, గొల్లపల్లి గ్రామాల్లో తుపాను వల్ల దెబ్బతిన్న మినుము, వరి పంటలను జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 320 హెక్టార్లలో మినుము, 20 హెక్టార్‌లలో వరి పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. పడిపోయిన వరి పంటను నిలబెట్టి కట్టలు కట్టుకోవాలని, గింజ మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు.

రైతులు అధైర్య పడొద్దు

ముదినేపల్లి :తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ గాలులు, వర్షాల కారణంగా నేల వాలిన వరి పైరును ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ బుధవారం పరిశీలించారు. మండలంలోని పెనుమల్లి, సంఘర్షణపురం, గురజ, చిగురుకోట, పెద కావునపూడి తదితర గ్రామాల్లో పడిపోయిన పంట పొలాలను రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు అధైర్య పడవద్దని, పడిపోయిన పంట పొలాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించేలా కృషి చేస్తామని చెప్పారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - ముసునూరు

తుపాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు కోరారు. ముసునూరు సిపిఎం కార్యాలయంలో రైతులతో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల పంటల దెబ్బతిన్నాయన్నారు. నాయకులు, అధికారులు వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా వచ్చే సాగర్ నీళ్ల మండలంలోని పలు గ్రామాల్లోకి చెరువులు నింపడానికి నాయకులు, అధికారులు తీసుకొచ్చారన్నారు. చెరువులు పూర్తిగా నిండి పంట పొలాలపై పొంగి పొర్లడంతో పంటలు దెబ్బ తినే పరిస్థితి ఉందని, నాగార్జునసాగర్ నీరు నిండిన చెరువులకు వెళ్లనీయకుండా ఆపాలని కోరారు.

తుపాన్‌తో ముదినేపల్లి అల్లకల్లోలం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మొంథా తుపాన్ ముదినేపల్లి మండలాన్ని అల్ల కల్లోలం చేసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఈదురుగాలులు, వర్షంతో మండల ప్రజలు బిక్కు బిక్కు మంటూ గడిపారు. బలమైన ఈదురు గాలులకు మండల వ్యాప్తంగా 101చెట్లు రహదారులపై, ఇళ్లపై కూలాయి. పలు గ్రామాల్లో రహదారులపై మహా వృక్షాలు కుక్కటి వేళ్లతో విరిగిపడడంతో అధికార యంత్రాంగం ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చెట్లను తొలగించారు. భారీగాలు లకు మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన గంగుల మధుసూదనరావుకు చెందిన నాలుగు మేకలు మృతి చెందాయి. భారీ వర్షానికి మండలంలోని వైవాకలో చెంపాల వెంకటేశ్వరరావుకు చెందిన ఐదు ఎకరాల చేపల చెరువు గండి పడింది. బలమైన గాలులు వేయడంతో అనేక గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలు ప్రజలు మంగళవారం సాయంత్రం నుంచి రాత్రంతా అంధకారంలోనే గడిపారు. మండల వ్యాప్తంగా సుమారు రెండు వేల ఎకరాల్లో వరి పంట నేల వాలింది. మూడు రోజులుగా జనజీవనం స్తంభించింది. బుధవారం ఉదయం పది గంటలకు తుపాన్ ప్రభావం తగ్గి వాతావరణం యధాస్థితికి రావడంతో ఇటు అధికారులు, అటు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



నీటిలో వరి పంట

సిఎం చంద్రబాబు ఏరియల్ సర్వే

సిఎం చంద్రబాబు బుధవారం సాయంత్రం ఐదు గంటలకు ముదినేపల్లి మండలంలో హెలికాప్టర్ నుంచి ఏరియల్ సర్వే నిర్వహించారు. అమరావతి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మండలంలో తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి పొలాలను ఏరియల్ సర్వే చేశారు. మండల వ్యాప్తంగా 14,500 ఎకరాల్లో రైతులు పంట సాగు చేయగా, రెండు వేల పైచిలుకు ఎకరాల్లో తుపాన్ ప్రభావానికి పంట దెబ్బతింది.

మొంథా తుపాన్ ప్రభావంతో దెబ్బ తిన్న పంటలు
ఆదుకోవాలని వేడుకుంటున్న అన్నదాతలు

పంట నష్ట నివారణ చర్యలు చేపట్టాలి

ముదినేపల్లి :రైతులు తుపాన్ నష్ట నివారణ చర్యలు చేపట్టాలని ఎడిఎ జి.వెంకటమణి అన్నారు. మండలంలోని వడాలి, కొర్రగుంటపాలెం, అల్లూరు గ్రామాల్లో బుధవారం క్షేత్ర సందర్శన చేసి తుపాను వెలసిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పలు సూచనలు రైతులకు వివరించారు.

ప్రతి పొలాల క్షేత్రస్థాయి పరిశీలన

కుక్కునూరు :మండలంలో ప్రతి పొలాలను మండల వ్యవసాయాధికారి ఆర్.బాలాజీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు వ్యవసాయ సహాయకులు సుధారాణి, భాగ్యలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం : బొరగం

పోలవరం :మండలంలో పట్టిసీమ నేలకొరిగిన వరి పంటను రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు రైతులతో కలిసి బుధవారం పరిశీలించారు. పంటలు దెబ్బతిన్న రైతులను పరామర్శించారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు.

పంచదార లేనట్టేనా..!
ఎంఎల్ఎస్ పాయింట్‌లో నిల్వ లేని నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి, మెట్ట ప్రాంత ప్రజలకు రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసే నిత్యావసర సరుకుల్లో పంచదార లేనట్టేనా అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం వ్యవసాయ మార్కెట్ గోడౌన్స్‌లోని పౌర సరఫరాల ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి చింతలపూడి, లింగపాలెం, నూజివీడు నియోజకవర్గంలోని చాట్రాయి మండలానికి రేషన్ షాపులకు నిత్యవసర సరుకులు పంపిస్తారు. కూటమి ప్రభుత్వం మొంథా తుపాన్ ప్రభావంతో ఇప్పటికే రేషన్ షాపుల్లో నిత్యావసర సరుకులు అందుబాటులో తీసుకొచ్చి 28వ తేదీ నుంచి రేషన్ పంపిణీ ప్రారంభించారు. కాని కేవలం బియ్యం మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. పంచదార మాత్రం అందుబాటులో లేదని రేషన్ కార్డు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక బుధవారం నాటికి ఎంఎల్ఎస్ పాయింట్ గోడౌన్‌లో సరుకులు నిల్వ పెట్టుకోకపోవటంతో నేటికీ పంచదార ప్రజలకు అందుబాటులోకి రాని పరిస్థితి నెలకొంది. అంగన్వాడీ కేంద్రాలకు పౌరసరఫరాల ద్వారా బాలింతలకు అందించే మూడు కేజీల బియ్యం ప్యాకెట్లు, కందిపప్పు, నూనె కూడా నేటికీ రేషన్ షాపులకు రాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకానికి అందించే 25 కేజీల బియ్యం, బెల్లం, రాగి కూడా నేటికీ పాఠశాలలకు చేరని పరిస్థితి. పౌరసరఫరాల ఎంఎల్ఎస్ ధర్మాజీగూడెంలో గోడౌన్‌లో సరుకులు నిల్వ ఉంటే స్టేజ్ టు రవాణా ద్వారా ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

పునరావాస కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడిలో ఏర్పాటు చేసిన సహాయ, పునరావాస కేంద్రాలను ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పరిశీలించారు. పట్టణంలో బాలుర, బాలికల హైస్కూళ్లల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను ఎంఎల్ఎ పరిశీలించారు. బోయగూడెం చెరువు వద్ద చెరువు గండి పూడ్చిన ప్రాంతాన్ని పరిశీలించారు. కొంతమంది వీధి దీపాల కోసం చేసిన విజ్ఞప్తిపై స్పందించి వారం రోజుల్లో విద్యుత్ లైను, లైట్లు, రహదారి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ఏలూరు సిటీ :మొంథా తుపాన్ ప్రభావం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా నగరపాలక సంస్థ అధికారులు మూడు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారపుపేట జిల్లా పరిషత్ హైస్కూల్, అగ్రహారంలోని కస్తూర్బా బాలికల హై స్కూల్, తంగళ్లమూడిలోని మసీదు వద్ద పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో సుమారు 120 మంది బాధితులకు తాత్కాలిక నివాసం కల్పించారు. ఈ పునరావాస కేంద్రాలను ఎంఎల్ఎ బడేటి చంటి, నగర కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ సందర్శించి బాధితులను పరామర్శించారు. తుపాన్ ప్రభావం కొంత తగ్గడంతో పునరావాస కేంద్రాల్లో ఉన్నవారందరూ ఇళ్లకు తిరిగి వెళ్లారు. తుపాన్ నేపథ్యంలో తక్షణమే స్పందించి చర్యలు తీసుకున్న మున్సిపల్ అధికారులకు, విద్యుత్ శాఖ అధికారులకు, అన్ని శాఖల అధికారులకు ఎంఎల్ఎ అభినందనలు తెలిపారు.

జంగారెడ్డిగూడెం :మొంథా తుపాన్ నేపథ్యంలో స్థానిక గద్దే లక్ష్మీ నరసమ్మ బాలికల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ పట్టణ నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరావాస కేంద్రంలో ఉన్నవారికి అవసరమైన ఆహారం, వైద్య సదుపాయాలను కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.స్లీవజోజి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, కౌన్సిలర్ నంబూరి రామచంద్ర రాజు, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ పాతూరి అంబేద్కర్, గెడా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ముసునూరు :పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అధికారులను కోరారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు బియ్యం, పప్పు, ఉప్పు, పంచదార, బంగాళదుంపలు, ఉల్లిపాయలు అందించేలా చర్యలు చేపట్టారు. చెక్కపల్లి పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కాటిపల్లి సూర్య వెంకట నాగ ప్రసాద్, సత్యనారాయణ, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ద్వారకాతిరుమల :మొంథా తుపాన్ నేపథ్యంలో పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు శివాజీ ఛారిటబుల్ ట్రస్ట్ తరపున ప్రముఖ సామాజిక సేవకుడు డాక్టర్ వేణు సాయం అందించారు. వారికి అవసరమైన దుప్పట్లు పంపిణీ చేశారు.

భోజనం అందజేత

ఉంగుటూరు : తుపాన్ కారణంగా కైకరం పునరావాస కేంద్రంలో బాధితులకు స్టేట్ వెలమ కార్పొరేషన్ డైరెక్టర్, జెడ్పిటిసి మాజీ సభ్యులు చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాధితులకు భోజనాలు అందించారు. సర్పంచి సలగల గోపీ తదితరులు పాల్గొన్నారు. స్థానిక జెజెపి ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేయగా భోజనాలు అందించారు. ఈ కార్యక్రమంలో పామర్తి సత్తిబాబు, రంది వాసు, యెర్నేని శ్యామల, బొద్దు శాంతకుమారి, గురువెల్లి నాగు, బుజ్జిబాబు, సురేష్, దుర్గారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పిల్లలకు పాలు, గుడ్లు అందజేత

ఉంగుటూరు :తుపాను ప్రభావంతో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లలకు బుధవారం గుడ్లు, పాలు అందించారు. ఐసిడిఎస్ జిల్లా పీడీ శారద, భీమడోలు సిడిపిఒ సునీల్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కైకరంలో పిల్లలకు బిస్కెట్లు, పాలు, గుడ్లు అందించారు. ఈ కార్యక్రమంలో కైకరం సర్పంచి సలగల గోపీ, సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం ఏర్పాటు

జంగారెడ్డిగూడెం :మొంథా తుపాన్ ప్రభావంతో పలు ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో మండలంలోని వేగవరంలో సర్పంచి లక్కాబత్తుల నాగరాజు ఆధ్వర్యంలో బంగారమ్మపేటలోని నిరాసుల కోసం పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం స్థానిక ఎంపియుపి స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసి, అక్కడి ప్రజలకు భోజన సదుపాయం, వసతి సదుపాయం కల్పించారు.

పోటెత్తిన ఉప్పుటేరు

ప్రజాశక్తి - కలిదిండి

ఉప్పుటేరు పోటెత్తడంతో ప్రధాన మురుగు కాలువల్లో నీటి ప్రవాహం నెమ్మదించింది. తుపాన్ ప్రభావంతో ఎగువన కురిసిన వర్షాలకు కొల్లేరులో అధిక మొత్తంలో నీరు చేరింది. ఆ నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలవాల్సి ఉంది. సముద్రం అల్లకల్లోలంగా ఉండడం, కొల్లేరు నుంచి అధిక మొత్తంలో ఉప్పుటేరుకు వరద నీరు చేరడంతో ఉప్పుటేరు పోటెత్తింది. స్థానిక లాల్యా మురుగు కాలువపై వంతెన రోడ్డు ఇటీవల కురిసిన అధిక వర్షాలకు కొట్టుకుపోయి కలిదిండి నుంచి కైకలూరుకు రాకపోకలు నిలిచి పోవడంతో కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ పరిశీలించారు. కొత్త వంతెన నిర్మాణం జరిగే లోగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక వంతెన ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

రోడ్డుపై కూలిన చెట్లు తొలగింపు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల నుంచి భీమడోలు వెళ్లే మార్గంలో తిమ్మాపురం, సూర్యచంద్రరావుపేట గ్రామాల్లో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లను గ్రామ నాయకులు, టి.సుధీర్, రెవెన్యూ అధికారులు తొలగించారు.

మండవల్లి : తుపాన్ ప్రభావంతో వీచిన ఈదురు గాలులకు అడ్డంగా విరిగిపడిన చెట్లను యుద్ధ ప్రాతిపదికన బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె.గోపాల్ మాట్లాడుతూ తుపాన్ అనంతరం ఈదురు గాలులకు తక్కెళ్లపాడు, అప్పారావు గ్రామంలో విరిగి పడిన చెట్లను సిబ్బందితో తొలగిస్తున్నామని చెప్పారు.

చెరువుల పరిశీలన

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న చెరువులను రెవెన్యూ, మండల పరిషత్ అధికారుల బృందం రైతులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రరావు, తహశీల్దార్ బద్దునాయక్, నోడల్ ఆఫీసర్ కె.సంతోష్ మాట్లాడుతూ తుపాన్ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో చెరువుల పటిష్టత పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గొళ్ల లోకేష్ యాదవ్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - దెందులూరు

మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన కౌలు రైతులకు పంటల బీమా పరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని సత్యనారాయణపురం, ఉంగ్రాజవరం గ్రామాల్లో పర్యటించి తుపాన్ ప్రభావిత పంటలను పరిశీలించారు. నేలవాలిన వరి పంటను పరిశీలించి నష్టం వివరాలను రైతులను, కౌలు రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తుపాను వల్ల పంటలు నష్టం జరిగి కౌలు రైతులు,పేద రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టాల నమోదు వెంటనే చేపట్టాలని కోరారు. పంటల బీమా పథకం వర్తింపజేసి ప్రీమియం చెల్లింపుతో నిమిత్తం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భూపేంద్ర సింగ్ హుడా కమిటీ సిఫారసులు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సున్నా వెంకట్రావు, కౌలు రైతులు అనకాపల్లి శ్రీనివాసరావు, ఎం.శివకృష్ణ, వి.ఫణీంద్ర, ఎ.అశోక్, తదితరులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నేతలు

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

ద్వారకాతిరుమల :మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, నష్ట పోయిన ఉద్యాన పంటల రైతులకు నష్టపరి హారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సం ఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని పంగిడిగూడెం, ఎం.నాగులపల్లి గ్రామాల్లో ఉద్యాన పంటలకు జరిగిన నష్టాలను రైతు సంఘం నాయ కులు బుధవారం పరిశీలించారు. రైతులను అడిగి నష్టం వివరాలను సేకరించారు. పంగిడిగూడెం గ్రామంలో బంతిపూలు పంట నష్టాలను పరిశీలించారు. పంట నష్టాలను నమోదు చేసి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మానుకొండ వీర్రాజు, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటాం

జనసేన మండలాధ్యక్షులు మధుబాబు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎవరికి ఎటువంటి ఇబ్బంది అయినా తెలియజేయాలని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని జనసేన పార్టీ మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు హామీ ఇచ్చారు. చింతలపూడి నగర పంచాయతీలో బోయగూడెం ఎస్‌టి హాస్టల్ సమీపంలో ఉన్న గృహాలను ఆయన బుధవారం పరిశీలించారు. అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం తహశీల్దార్, ఎంపిడిఒలతో మాట్లాడి ఎటువంటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. బాలికల పాఠశాలలో పునరావాస కేంద్రంలో ఉన్నవారికి తహశీల్దార్ ప్రమద్వర, డిప్యూటీ తహశీల్దార్‌లతో కలిసి భోజనం వడ్డించారు.



భోజనం వడ్డిస్తున్న చీదరాల మధుబాబు

ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొత్త పట్టిసం గ్రామపంచాయతీ పరిధిలో త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామంలోని తాగునీటి పంపులు పనిచేయక నీటి సరఫరా పూర్తిగా ఆగిపోయింది. గ్రామస్తులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుసుకున్న గ్రామ సర్పంచి మైగాపుల విజయదుర్గ తక్షణ చర్యలు తీసుకున్నారు. బుధవారం నాలుగు వాటర్ ట్యాంకర్ల ద్వారా వీధి వీధికి తిరుగుతూ తాత్కాలిక నీటి సరఫరా చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఉండేలా తాత్కాలికంగా నీటి సరఫరా చేస్తామన్నారు. విద్యుత్ పునరుద్ధరణ అయిన వెంటనే తాగునీరు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ప్రసాద్ పాల్గొన్నారు.



ట్యాంకర్ ద్వారా నీరు పట్టుకుంటున్న ప్రజలు

కూలిన ఇల్లు

ముసునూరు :తుపాన్ ప్రభావం వల్ల మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో కొప్పుల నాగేశ్వరరావు ఇల్లు కూలింది. టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అధికారులతో కలిసి పరిశీలించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పులి బళ్ల లక్ష్మీసత్యనారాయణ, టిడిపి గ్రామ అధ్యక్షులు బర్మా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ ప్రభావం పోలవరం మండలంలో స్వల్పం

పోలవరం :మొంథా తుపాన్ ప్రభావం పోలవరం మండలంలో పెద్దగా కనిపించలేదని తహశీల్దార్ సాయిరాజు తెలిపారు. మండలంలో ఎక్కడా ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగలేదన్నారు. ఏజెన్సీ పరిధిలోని తుపాన్ ప్రభావితులకు సాయం అందించేందుకు గుంజవరం గ్రామంలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ, విద్యుత్, పోలీసు శాఖ, సచివాలయాల, మండల పరిషత్ ఇలా అన్ని ప్రభుత్వ శాఖల వారు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు.